AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
24-4-2026 (Friday) MAIN EDITION

## ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ కౌంటర్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్‌ను నరకంతో పోలుస్తూ సోషల్ మీడియాలో ఓ లేఖ పోస్ట్ చేసిన విషయం తెలిసిందే. ట్రంప్ వ్యాఖ్యలకు తాజాగా ఇరాన్ కౌంటర్ ఇచ్చింది. జన్మత అమెరికా పౌరసత్వ చట్టం విషయంలో భారత్, చైనాలను నరక కూపాలుగా ట్రంప్ అభివర్ణించిన విషయం తెలిసిందే. ఈ దేశాల నుంచి వచ్చే ప్రజలు పిల్లలను కన్న తర్వాత కుటుంబాన్ని మొత్తం అక్కడకు తీసుకు వెళ్తారని ఉన్న లేఖను ఆయన పోస్ట్ చేశారు. ఇరాన్ ఆయనను ఎగతాళి చేసింది. ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్, మహారాష్ట్ర గొప్ప సాంస్కృతిక, భౌగోళిక వారసత్వాన్ని వివరిస్తూ ఒక వీడియోను 'ఎక్స్'లో షేర్ చేసింది.

## ఎస్‌బీఐలో ఉద్యోగావకాశాలు




**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పలు ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఇది నిరుద్యోగ యువత కోసం కాదు.. బ్యాంకింగ్ రంగంలో అనుభవం ఉన్న రిటైర్డ్ అధికారులకు మళ్లీ పని చేసే అవకాశం కల్పించనుంది. 105 రిజాల్వర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనుంది. ఎంపికైన వారు కస్టమర్ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించే బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. రిటైర్డ్ ఎస్‌బీఐ అధికారులు మాత్రమే అర్హులు. పూర్తి వివరాలకు ఎస్‌బీఐ అధికారిక వెబ్‌సైట్ sbi.bank.in ను సంప్రదించాలి.

## త్వరలో ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు..



**అక్షరటుడే, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కీలక ఘట్టానికి వేదిక సిద్ధమవుతోంది. త్వరలోనే శాసన సభ ప్రత్యేక సమావేశాలను నిర్వహించనున్నట్లు సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కూటమి నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు.

## భారత్‌లో 207 మంది బిలియనీర్లు..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంఖ్య వేగంగా పెరుగుతోంది. భారత్‌లో ప్రస్తుతం 207 మంది బిలియనీర్లు ఉన్నారు. అయితే వచ్చే ఐదేళ్లలో ఈ సంఖ్య 51 శాతం పెరుగుతుందని నైట్‌ఫ్రాంక్ అనే సంస్థ అంచనా వేస్తోంది. అంటే 2031 నాటికి దేశంలో కుబేరుల సంఖ్య 313కి చేరుతుందన్న మాట.

## ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలని నోటీస్



**అక్షరటుడే, ఢిల్లీ :** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ ప్రతిపక్ష పార్టీలు రాజ్యసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని నోటీసును సమర్పించాయి. ఈ నెల మొదట్లో సీఈసీని తొలగించాలని కోరుతూ పార్లమెంట్ ఉభయ సభల్లో సమర్పించిన నోటీసులను తిరస్కరించిన విషయం తెలిసిందే.

## దీదీ ఇంటికి.. బీజేపీ అధికారంలోకి : అమిత్ షా



**అక్షరటుడే, కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో పెను మార్పు రాబోతోందని, తొలి దశ ఎన్నికలతోనే బీజేపీ విజయం ఖరారైపోయిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. కోల్‌కతాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. మొదటి విడతలో పోలింగ్ జరిగిన 152 స్థానాలకు గాను, బీజేపీ ఏకంగా 110 కంటే ఎక్కువ సీట్లను గెలుచుకోబోతోందని ధీమా వ్యక్తం చేశారు. "దీదీ (మమతా బెనర్జీ) ఇంటికి వెళ్లే సమయం ఆసన్నమైంది.. బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం" అంటూ అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

## మరో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

**అక్షరటుడే, భూపాలపల్లి:** రాష్ట్రంలో ఆర్టీసీ సమ్మె కొనసాగుతోంది. ఈ క్రమంలో మరో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం చేశాడు. భూపాలపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన రవీందర్ పురుగుల మందు తాగాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఇప్పటి వరకు నలుగురు ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. అందులో శంకర్‌గౌడ్ అనే డ్రైవర్ మృతి చెందిన విషయం తెలిసిందే.

# రేపే కవిత కొత్త పార్టీ



**తెలంగాణలో కొత్త పార్టీ పురుడు పోసుకోనుంది. కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ వేదికను ప్రారంభించనున్నారు. తెలంగాణ జాగృతి పేరిట ఇన్ని రోజులూ కార్యక్రమాలు చేపట్టిన ఆమె ఇక పూర్తిస్థాయి రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు పార్టీ పేరు, జెండా, ఎజెండా ప్రకటించనున్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మునీరాబాద్‌లో ఈ వేడుక నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే హోర్డింగ్‌లు, కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్**

- **మునీరాబాద్‌లో పేరు ప్రకటించనున్న జాగృతి అధ్యక్షురాలు**
- **భారీగా తరలి వెళ్లనున్న అభిమానులు**
- **ఏర్పాట్లు చేస్తున్న నాయకులు**
- **పార్టీ పేరు, జెండాపై సస్పెన్స్**

తన తండ్రి స్థాపించిన బీఆర్ఎస్ నుంచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన కవిత.. ఇప్పుడు కొత్త పార్టీ పెట్టనున్నారు. తన తండ్రి పార్టీకి పోటీగా కొత్త పార్టీతో ముందుకు వస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన అనంతరం కవిత రాజకీయ పార్టీ ఏర్పాటు కోసం కసరత్తు చేశారు. ఈ మేరకు ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తెలుసుకున్నారు. జాగృతి జనంబాట పేరిట రెండు నెలల పాటు అన్ని జిల్లాల్లో పర్యటించారు. పలు ప్రజా సమస్యలపై పోరాటాలు చేశారు. పలు కమిటీలు వేసి పార్టీ విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు. అన్ని ఏర్పాట్లు పూర్తయిన నేపథ్యంలో రేపు పార్టీ పేరును ఆమె ప్రకటించనున్నారు.

### సామాజిక తెలంగాణ కోసం..

సామాజిక తెలంగాణ కోసం కొత్త పార్టీ పెడుతున్నట్లు గతంలో కవిత ప్రకటించారు. భౌగోళిక తెలంగాణ వచ్చినా.. సామాజిక తెలంగాణ సాధ్యం కాలేదని ఆమె పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై విమర్శలు చేసిన ఆమె.. ప్రస్తుత కాంగ్రెస్‌పై సైతం విరుచుకు పడుతున్నారు. మరోవైపు కేంద్రంలోని బీజేపీపై సైతం విమర్శలు ఎక్కు పెడుతున్నారు. రాష్ట్ర ప్రజల కోసం కొత్త పార్టీ అవసరం ఉందని.. తెలంగాణ నూతన పార్టీకి అవకాశం ఉందని కవిత వ్యాఖ్యానించారు.


### పేరు అదేనా..

కవిత ఇన్ని రోజులుగా తెలంగాణ జాగృతి సంస్థ ద్వారా కార్యక్రమాలు చేస్తున్నారు. అయితే పార్టీ పేరు వేరుగా ఉంటుందని సమాచారం. సర్వోదయ తెలంగాణ, తెలంగాణ ప్రజా వికాస్ సమితి, తెలంగాణ ప్రజా జాగృతి పేర్లలో ఒకటి ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. పార్టీ ఆవిర్భావ సభ వద్ద ఏర్పాటు చేస్తున్న తోరణాలపై తెలంగాణ ప్రజావికాస్ సమితికి స్వాగతం అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో ఇదే పార్టీ పేరు అని చర్చ జరుగుతోంది. అయితే పార్టీ పేరుపై రేపు ఉదయం స్పష్టత రానుంది. బోర్డులపై తెలంగాణ వారసత్వ సంపద గోల్కొండ, కాకతీయ తోరణం డిజైన్ల ఏర్పాట్లు చేశారు.

### తండ్రికి పోటీగా..

కవిత తన తండ్రి స్థాపించిన బీఆర్ఎస్ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించారు. తండ్రి నీడన, బీఆర్ఎస్ పార్టీలో కీలక శక్తిగా ఎదిగారు. ఓ సారి ఎంపీగా గెలిచారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. పార్టీలో అంతర్గత వ్యవహారాలతో కవితను బీఆర్ఎస్ సస్పెండ్ చేసింది. దీంతో ఏకంగా తండ్రి కేసీఆర్‌కు పోటీగా కవిత పార్టీ పెడుతుండడం గమనార్హం.

## ఆ ఫైళ్లన్నీ ఓపెన్ చేస్తాం.. దోషులకు శిక్ష తప్పదు: మోదీ



**అక్షరటుడే, కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ సాగిస్తున్న అరాచక పాలనకు ముగింపు పలికే సమయం ఆసన్నమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దమ్ దమ్ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ఆయన.. తృణమూల్ కాంగ్రెస్ శ్రేణులకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. మే 4న వెలువడబోయే ఫలితాలు బెంగాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తాయని స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత టీఎంసీ గూండాలు ఎక్కడా దాక్కోలేరని, వారిని ఎవరూ కాపాడలేరని మోదీ హెచ్చరించారు. బెంగాల్ ప్రజలపై జరిగిన ప్రతి అన్యాయానికి, అరాచకానికి సంబంధించిన ఫైళ్లను బయటకు తీస్తామని, దోషులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

## త్వరలో ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు





**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** రాష్ట్రంలో త్వరలో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బదిలీ చేయనున్నట్లు సమాచారం. పలువురు అధికారుల పనితీరుపై సీఎం, మంత్రుల అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. దీంతో కీలక స్థానాల్లో ఉన్న వారికి స్థానచలనం కలిగించనున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్న పలువురు అధికారులపై సీఎం ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే వారిని ట్రాన్స్‌ఫర్ చేయనున్నట్లు సమాచారం. అలాగే నూతన డీజీపీ నియామకం తర్వాత ఐపీఎస్‌ల బదిలీలు సైతం చేపట్టనున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌ను తెలంగాణ కొత్త డీజీపీగా నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. దీంతో కొత్త డీజీపీగా సీవీ ఆనంద్‌ను నియమించనున్నట్లు సమాచారం. ఆయన మే 1 నుంచి ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

## శంకర్ గౌడ్ మరణం ప్రభుత్వ హత్యే : బండి సంజయ్



**అక్షరటుడే, కరీంనగర్ :** శంకర్ గౌడ్ మరణం ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఆయన కరీంనగర్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్ గౌడ్ మృతిపై బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నేడు తెలంగాణ సమాజమంతా బాధపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి, నిర్లక్ష్యం కారణంగా కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల కోసం ఎవరైనా ఆందోళన చేస్తే.. ప్రభుత్వం చర్చించాల్సింది పోయి బెదిరించడం సరికాదన్నారు. సమ్మెతో 10 వేల బస్సులు ఆగిపోయాన్నారు. ఇంత పెద్ద సమ్మె జరుగుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

## ఇరాన్ వెళ్లొద్దు.. భారత రాయబార కార్యాలయం అడ్వైజరీ



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** భారత పౌరులు విమాన లేదా భూమార్గం ద్వారా ఇరాన్ వెళ్లవద్దని టెహ్రాన్ లోని భారత రాయబార కార్యాలయం సూచించింది. భారత్, ఇరాన్‌ల మధ్య కొన్ని విమాన సర్వీసులు ప్రారంభం కానున్నట్లు వస్తున్న వార్తల దృష్ట్యా, గతంలో జారీ చేసిన హెచ్చరికలకు కొనసాగింపుగా, భారత పౌరులు ఇరాన్‌కు ప్రయాణించవద్దని పేర్కొంది. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారత జాతీయులందరూ రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ.. నిర్దేశిత భూ సరిహద్దు మార్గాల ద్వారానే దేశం విడిచి వెళ్లాలని సూచించింది.

## నితిన్ సరసన రితికా నాయక్..!




**వరుస డిజాస్టర్లతో యంగ్ హీరో నితిన్ సతమతమవుతున్న విషయం తెలిసందే. అయితే తన నెక్ట్స్ సినిమాతో గట్టి కమ్‌బ్యాక్ ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నారని ఇండస్ట్రీలో టాక్. 'భీష్మ' తర్వాత సరైన హిట్ లేని నితిన్.. ప్రస్తుతం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాణంలో ఓ సినిమాకు రెడీ అయ్యారు. ఈ చిత్రంలో 'అశోకవనంలో అర్జున కళ్యాణం' ఫేమ్ రితికా నాయక్ కథానాయికగా ఎంపికయ్యారు. ప్రస్తుతం రితికా టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారుతోంది. నితిన్ వరుస ఫ్లాపుల గండాన్ని రితికా అయినా గట్టెక్కిస్తుందేమోనని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.** **- అక్షరటుడే, సినిమాడెస్క్**

## కాంగ్రెస్ నేత పవన్ ఖేరా బెయిల్ పిటిషన్ కొట్టివేత



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ సతీమణి ఫిర్యాదుపై నమోదైన ఎఫ్ఐఆర్‌లో కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరాకు గౌహతి హైకోర్టు ముందస్తు బెయిల్‌ను నిరాకరించింది. ఆయన పిటిషన్‌ను శుక్రవారం కోర్టు కొట్టివేసింది. పవన్ ఖేరా ఏప్రిల్ 4న జరిగిన ప్రెస్ మీట్‌లో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ సతీమణి రినికి భుయాన్ శర్మపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆమె మూడు దేశాల పాస్‌పోర్టులు కలిగి ఉన్నారని, దుబాయ్‌లో అక్రమ ఆస్తులు ఉన్నాయని ఆరోపించారు. దీనిపై ఆమె అస్సాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి పవన్ ఖేరా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు ఏప్రిల్ 10న వారం రోజుల పాటు ముందస్తు బెయిల్ ఇచ్చింది. దీనిపై పోలీసులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు మంజూరు చేసిన ట్రాన్సిట్ ముందస్తు బెయిల్‌పై అత్యున్నత న్యాయస్థానం స్టే విధించింది.

## 16 వేల మందికి ఉద్వాసన!



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** టెక్ కంపెనీలలో లేఆఫ్స్ ప్రకంపనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పెట్టుబడులు పెంచేందుకు, నిర్వహణ ఖర్చులు తగ్గించుకునేందుకు ఉద్యోగులను బలి చేస్తున్నాయి. తాజాగా మెటా 8 వేల మందిని, మైక్రోసాఫ్ట్ 8,750 మందిని తొలగించాలని నిర్ణయించాయి. ఈ మేరకు బైఅవుట్ ఆఫర్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. మేనేజ్‌మెంట్ లేయర్లను తగ్గించి, టెక్నికల్ టీమ్‌స్‌ను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కంపెనీలు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. మెటా తన పనితీరును మార్చుకోవాలని నిర్ణయించుకుంది. కంపెనీలో అనవసరంగా ఉన్న మేనేజ్‌మెంట్ లేయర్లను తొలగించి, నేరుగా టెక్నికల్, ఇంజినీరింగ్ టీమ్స్‌కే పవర్ ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. మైక్రోసాఫ్ట్ నేరుగా పింక్ స్లిప్ ఇవ్వకుండా సెటిల్‌మెంట్ ప్యాకేజీతో వలంటరీ రిటైర్‌మెంట్ పద్ధతిని ప్రోత్సహిస్తోంది.